# త్వరగా త్వరత్వరగా

సాయంత్రం ఆరున్నర గంటలైంది. చీకటి మొదలవుతూంది. "చీకటిపడే వరకు బయట తిరక్క! పురుగూపుట్రా ఉంటుంది" అంటుంది మామ్మ. "ఉద్యోగం లేకపోయినా తిరుగుళ్ళకి తక్కువలేదు. త్వరగా ఇంటికి దయచెయ్యి!" అంటాడు నాన్న. "నువ్వాలస్యం చేస్తే, నాపని అర్ధరాత్రి వరకు తెమలదు. త్వరగా వచ్చేయి బాబూ!" అని బతిమాలుతుంది అమ్మ. నిజానికి నేను త్వరగా ఇంటికివెళ్ళి త్వరగా భోజనం చేశాక తీరుబడిగా తోచక చావాలి!" అన్నం నాకు మూత పెట్టెయ్యమ్మా!" అంటే అమ్మకి నచ్చదు. "అందరిదీ తలోదారైతే ఎలారా?" అంటుంది. ఏడుగంటలైనప్పటి నుంచి మామ్మ "వీడింకా రాలేదేమర్రా!" అంటూ ఇంట్లో అందరిని హడలుగొడుతూ ఉంటుంది మామ్మ. అల్లా అన్నప్పుడల్లా – "ఎందుకేమిటి? బుద్ధిలేక' అని జవాబిస్తూనే ఉంటాడు నాన్న. ఇవన్నీ తప్పించుకోవాలంటే నేను ఏడు లోపల ఇంటికి చేరుకోవాలి. అందుకని చెరువుదగ్గర సిగరెట్లు కాలుస్తున్న మిత్రబృందం నుంచి సెలవు తీసుకున్నాను. నా తొందర వాళ్ళకి తెలుసు.

ఇంటికి చేరుకునేసరికి అమ్మ. అక్కయ్య పిల్లలకి అన్నం పెడుతూంది. "అలా ఈలిగిలపడి భోజనం చెయ్యకండి. కాళ్లు కడుక్కుని ఆ తడి ఆరే లోపల అన్నం తిని లేవాలి. లేకపోతే దరిద్రం" అని అమ్మ పిల్లల్ని కసురుకుంటూ తొందర పెడుతూంది. "మరేమో, అమ్మమ్మా! అన్నం నమిలి, నెమ్మదిగా తినాలి అని చెప్పారు మా సైన్సు మేస్టారు" అన్నాడు మేనల్లుడు ధైర్యం చేసి. "కబుర్లు కట్టి పెట్టి త్వరగా భోజనం చెయ్యి!" అంటూ రంగంలోకి వచ్చింది మా అక్కయ్య. అది పురుడు పోసుకోడానికి వచ్చింది. కనేపిల్లల్ని త్వరగా కనేస్తే వాళ్లు త్వరగా చేతికందివస్తారని మా బావ ఉద్దేశం.

నాకు, అన్నయ్యకి, నాన్నకి, అక్కయ్యకి వడ్డించింది అమ్మ. నాన్న అమ్మ అన్నం తెచ్చే లోపల కూర, నెయ్యి తెచ్చే లోపల అన్నం తినేస్తూ "త్వరగా వడ్డించి చావవు" అంటూ విసుక్కుంటూ భోజనం చేస్తున్నాడు. అమ్మకోపం వదినమీదకి తిరిగింది. "ఆ మహారాణి పుట్టింట్లో కూర్చుంది. దాన్నిత్వరగా రమ్మన్రా! పనితో చస్తున్నాను అంటే పెద్దాడు వినిపించుకోడు" అంది అమ్మ. "మొన్ననే కదమ్మా అది వెళ్ళింది" అన్నాడు అన్నయ్య తలవంచుకుని. అమ్మ మాట్లాడలేదు. నిజానికి వదినంటే అమ్మకి పుట్టెడు సానుభూతి. మా ఇంట్లో అన్నింటికి ఉరుకులు, పరుగులు. ఎందుకో, ఎక్కడికో ఎవరికీ తెలియదు.

మా వదిన ఉంటే, వదిన పనిచేస్తుంటే అమ్మ హైరానా పడుతుంది. వదిన లేకపోతే, పనీ హైరానా కూడా మా అమ్మవంతే. ఎక్కడికైనా వెళ్ళి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలనుకుంటుంది. "ఎక్కడికో ఎందుకు? హాయిగా మనింట్లోనే ఏదీ కల్పించుకోకుండా విశ్రాంతిగా ఉండరాదా?" అంటాను నేను. "ఎల్లా వీలవుతుంది?" అంటుంది. అమ్మ వీలుచేసుకోదు. కనీసం వదినైనా రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటుందని అమ్మే వదినని పంపించింది. రేపెలాగూ వస్తుంది వదిన. వదిన త్వరగా రావటం అంటే సాయంత్రం బండిలో కాకుండా పొద్దున్న బండిలోనే రమ్మని అన్నయ్య వదినతో గట్టిగా చెప్పాడో లేదో అని అమ్మభయం.

అన్నాలు తిన్నాక, అక్కయ్య పిల్లలకి పక్కలు వేసి, "అల్లరి చెయ్యకుండా త్వరగా పడుకోండి. లేకపోతే తాతయ్యకి కోపం వస్తుంది" అంటూ పిల్లల్ని పడుకోబెట్టింది. నాన్న నన్ను పిలిచాడు.

"త్వరగా ఏదో ఒక ఉద్యోగంలో చేరు! నా బాధ్యతలు తీరితే తీరుబడిగా కృష్ణా రామా అనుకుంటాను. ఎన్నాళ్ళిలా అడ్డగాడిదలా చెరువుగట్లంట తిరుగుతావు!" అంటూ రోజూ రాత్రి ఇచ్చే ఉపన్యాసం మొదలుపెట్టాడు. నాకు ఏవో రెండు ఉద్యోగాల ఆఫర్స్ ఉన్నాయి. చేరటానికి ఇంకో నెల టైముంది. జీవితంలో ఇవే నా చివరి సెలవులు. అందుకని, గడువు చివరి రోజున తప్ప నేను ఉద్యోగంలో చేరదలుచుకోలేదు. నాన్న మళ్ళీ మొదలుపెట్టాడు. "మా నాన్నకి, మీ అమ్మ తండ్రికి ఒకేసారి డెప్టీ తాసీల్దారు ఉద్యోగాలు అయ్యాయి. మా నాన్న పొద్దున్నే వెళ్ళి ఉద్యోగంలో చేరాడు. మా మామగారు భోజనం చేసి వర్జ్యం పోయాక చేరాడు. దానికి మా నాన్నగారు మా మామగారికి జీవితాంతం సీనియర్ అయ్యాడు. అందుకని మా నాన్న తాసీల్దారుగా రిటైరైతే మా మామగారు డెప్టీగానే రాటైరయ్యారు. సీనియారిటీ పోతుంది. త్వరగా వెళ్ళి చేరు!" అంటూ చెప్పాడు. ఆయన మాట నిజమే. కాని, ఈ రోజుల్లో ప్రమోషన్లు రావాలంటే సీనియారిటీ చాలదు.

"వాడు త్వరగా ఉద్యోగంలో చేరడు. నువ్వు వాడికి త్వరగా పెళ్ళిచెయ్యవు" అంటూ మామ్మ, నాన్నతో యుద్ధానికి దిగింది. "వాడు ఉద్యోగంలో చేరిన మరునాడు పెళ్ళిచేస్తాను" అన్నాడు నాన్న. "నా పెళ్ళికి తొందరేమిటి, మామ్మా! నాకిప్పుడు ఇరవై రెండేళ్ళేగా" అన్నాను. "ఏ వయస్సులో ముచ్చట ఆ వయస్సులో జరగాలి. ఇరవై రెండేగా అంటే నలభై రెండు వచ్చాక చేసుకుంటావా? మీ తాతకి ఈ వయస్సులో మీ నాన్నకి రెండేళ్ళ వయస్సు. మీ నాన్నకీ వయసులో నువ్వు పుట్టావు. బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా... అని ఊరికే అన్నారా? అయినా, నీ కడుపునో కాయ త్వరగా కాస్తే, నేను చూసి చద్దామని. మీకు మీ ఇష్టాయిష్టాలే గాని. మావి పట్టవు" అంది మామ్మ. ఆవిడ ఇది ప్రతి రాత్రి చెప్పే పురాణమే! ఏదో ఒక ఏడాది పాటు ఉద్యోగం చేస్తూ ఏ బాదరబంది లేకుండా సెకెండు షోలు చూస్తూ బ్రహ్మచర్యం గడపాలని, ఆ పైన మరో ఏడాదిపాటు బుద్ధిగా డబ్బు కూడబెట్టి ఆ పైన పెళ్ళి చేసుకోవాలని నా కోరిక. చేతిలో డబ్బు ఉంటేనే

కదా కట్టుకున్నదానికి ఓ ఏడాది పాటైనా చీరలు కొన్నా, సినిమాలు చూపించినా? ఆపై ఏడాదికి ఎంత డబ్బూ పాలడబ్బాలకి డాక్టర్లకి సరిపోదు. అంటే నేను మాత్రం ఏం పెద్ద ఆలస్యం చేస్తున్నాను. పాతిక సంవత్సరాలకి తండ్రి నవుతాననే అంటున్నాను కదా! మా మామ్మకి ఇంతాచేసి మహా ఉంటే అధిక మాసాలతో కలిపి, అరవై ఏళ్ళు! ఆవిడ అధిక మాసాలు కలుపుకొని కాని వయస్సు చెప్పదు. మరో పదేళ్ళు సులభంగా బతుకుతుంది. ఆఖరికిచావుకి కూడా త్వరపడుతుంది ఎందుకో! కళ్లు మూసుకుని పడుకున్నాను.

వంటింట్లో చప్పుళ్లు మొదలయ్యాయి. అంటే, మామ్మ లేచిందని, నాలుగున్నర అయిందని అర్థం. ఏవో కొంపలంటుకు పోతున్నట్టు నాలుక్కే లేచి నాలుగున్నరకి మంచి హడావిడిలో ఉంటుంది. బద్ధకంగా మంచం మీద కళ్లు గట్టిగా మూసుకుని పడుకున్నాను. చీకట్లు విచ్చుకుంటున్నాయి. అమ్మ చీపురు బక్కెట్టు పుచ్చుకుని, వీధి గుమ్మం మీద దాడి మొదలుపెట్టింది. “ఈ దాసీది ఎక్కణ్ణుంచో నా ప్రాణం మీదకు వచ్చిపడింది. రోజు తెల్లారేసరికి రావే! ఇంటో యజమాని లేచే సరికి పాచిగుమ్మం ఉండరాదు అని మొత్తుకుంటూనే ఉంటాను. అది అలాగే అంటుందే కాని త్వరగా వచ్చి చావదు. దాని మోహంమండా! పైగా ఇకిలిస్తుంది” అంటూ దండకం చదువుతూ గుమ్మాలు కడుగుతూంది. అదెల్లాగు ఇంకో అరగంటకి రానే వస్తూంది. ఈ లోపల అమ్మ చెయ్యవలసినంత హడావిడి చేస్తుంది.

అమ్మ గుమ్మాలు కడిగేసరికి నాన్న లేచి పళ్లు తోముకున్నారు. “పాలవెధవ వచ్చాడా!” అంటూ ఒక్క అరుపు అరిచారు. అమ్మ నాన్నకి జవాబు చెప్పలేదు. అప్పుడే ఆలస్యంగా వచ్చిన పనిమనిషిని దులిపెయ్యటం మొదలుపెట్టింది. “బారెడు పొద్దెక్కితే గాని పాలవాడు వచ్చి చావడు” అని నాన్నగారు విసుక్కోవడం మొదలుపెట్టారు. వీధిలో సైకిల్ బెల్ మోగింది అంటే అరుగంటలైందన్న మాట. పాలవాడు వచ్చాడు. “కాఫీలు కలిపేస్తున్నాను. లేచి మొహాలు కడుక్కోండి. నేను పదిసార్లు వేడి చెయ్యలేను. అది కూడా పుట్టింటిలో వెళ్ళి కూర్చుంది” అంటూ అమ్మ నాకు, అన్నయ్యకి అక్కయ్యకి చివరిగంట కొట్టేసింది. ఆరున్నర కల్లా కాఫీలు అయిపోయాయి. కాఫీలు అయీ అవగానే నీళ్ళ పొయ్యికింద మంటచేసింది అమ్మ.

ఏడుగంటలయ్యే సరికల్లా స్నానాల హడావిడి. “స్నానాలు చెయ్యండర్రా” అంటూ అమ్మ గొడవ. “నా పిల్లల స్నానాలయ్యాక గాని నేను పోసుకోవడం ఎల్లా” అని అక్కయ్య జవాబు. “త్వరగా కానియ్యండి నీళ్ళు చల్లారిపోతాయి. ఆ పైన నేను మడికట్టుకోవాలి.” అమ్మతొందర పెడుతూంది అందర్నీ. ప్రతిరోజు త్వరగా లేచి, త్వరగా స్నానాలు చేసి త్వరగా భోజనం చేసి, త్వరగా నిద్రపోయి...అంతా తొందరే ఎందుకో?

అమ్మ మడికట్టుకునేసరికి మామయ్య వచ్చాడు. “బావా! ఈ నెలలో మా వరలక్ష్మికి పెళ్ళి చేసేద్దామనుకుంటున్నాను ఏమంటావు” అంటూ సూటిగా రంగంలోకి దిగాడు. “ఏమిటంత తొందర” అని నాన్న తాపీగా అడిగాడు. “ఆడపిల్ల గుండెల మీద కుంపటి.

అదెంత త్వరగా దింపుకుంటే అంత సుఖం. దానికప్పుడే పదిహేడో ఏడు. నీ చెల్లెలు ఈ రోజు ఎటూ తేల్చుకురాకపోతే అన్నం వండనని భీష్మించుకుకూర్చుంది. త్వరగా నోట్లో మెతుకులు పడకపోతే, నా పనయిపోతుంది. నీకేం!" అని నిష్ఠూరమాడాడు. మా నాన్న మా అక్కయ్య పెళ్ళి విషయంలో ఇల్లాగే తొందరపడ్డాడు. పెళ్ళయ్యాక కార్యం చేస కాపురానికి పంపటానికి అంతకంటే తొందరపడ్డాడు. నా పెళ్ళి అందరు ఒప్పుకున్నదే. నాకు వరలక్ష్మి అంటే చాలా ఇష్టం. కాని, త్వరగా పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. పెళ్ళయితే మావయ్య ఇప్పుడు నాకు చేసే మర్యాదలో వాళ్ళింటికి వెళితే చేసే ఆర్భాటంలో సగం చెయ్యడు. వరలక్ష్మి ఇప్పుడు పడినంత సిగ్గు అప్పుడు పడదు. అమ్మ "అది వెళ్ళి పుట్టింట్లో కూర్చుంది" అని వరలక్ష్మిని కూడా విసుక్కుంటుంది. కాని నా మాటకి విలువేమిటి? అందరు పెద్దవాళ్ళు చేరి ఆ నెలలో నా బ్రహ్మచర్యానికి స్వస్తి పలకటానికి నిశ్చయం చేశారు.

వీధిలో బండి ఆగింది. వదిన, పిల్లలు వచ్చారు. "త్వరగా వచ్చి మనింట్లో పడేదాకా నాకు తోచలేదత్తయ్యా!" అంది అమ్మతో. నాకు తెలియదుటే నీ సంగతి" అంది అమ్మ. "త్వరగా స్నానం చేసి వస్తా" అంటూ వదిన నీళ్ళ గదిలోకి వెళ్ళింది. ఇంతలో పక్కింట్లోంచి గొల్లున ఏడ్పులు వినిపించాయి. చాలా రోజులుగా మంచంలో వున్న ముసలాయన పోయినట్టున్నాడు. అమ్మ మైలపడింది. అమ్మా, నాన్నా అక్కడికి వెళ్ళారు. ఓ గంటపోయాక వచ్చారు. పెద్దకొడుకు వూళ్ళోలేడుట, టెలిగ్రామ్ ఇచ్చారుట. అతను టాక్సీ చేయించుకు రావాలిట. అంతవరకు శవం ఉంచుతారట. పన్నెండయింది. ఒంటి గంటయింది పెద్దకొడుకు జాడలేదు. వీధిలోని అందరు చిన్నకొడుకుని కర్మచెయ్యమన్నారు. వీధిలో శవం ఉన్నంతసేపు ఎవరిళ్ళలోను నిప్పు రాజెయ్యరాదుట. వండుకోరాదుట. తినరాదుట. "త్వరగా శవం కదల్చక పోతే వీధంతా ఈ రోజుకి పస్తే. చిన్నపిల్లలున్న వాళ్ళకి ఎలా! చిన్న కొడుకుని తగలెయ్యమని గట్టిగా చెప్పండి" అంది అమ్మ నాన్నగారితో. ఆఖరికి మనిషి చచ్చాకకూడా ఆ అంతిమ ప్రయాణం చేసేటప్పుడు కూడా ఈ తొందర తప్పదు. వీధి వాళ్ళంతా చిన్నకొడుకు చేత చితికి నిప్పు అంటింపచేశారు. నిప్పంటించిన అయిదు నిమిషాలకి పెద్దకొడుకు వచ్చాడు.

రాత్రి భోజనాలయ్యాక అక్కయ్య నొప్పిగా వుందంది. "భయపడ్డావేమోనే" అంది అమ్మ. నిజం నొప్పులని తెలాక నన్ను – "మంత్రసానిని త్వరగా తీసుకురా" అని పంపారు. రాత్రి పన్నెండయింది. అక్కయ్య నొప్పులు పడుతూంది. పురుడు కష్టమయ్యేలా వుంది. "త్వరగా పురుడు వచ్చేటట్టు చెయ్యి తల్లీ! నీ గుళ్ళో అభిషేకం చేయిస్తాను" అని మామ్మ దండం పెట్టుకుంటూంది. "ఇంకో ఘడియ అయితే అష్టమి వస్తుంది" ఆలస్యం అంటూ నాన్న హడావిడి పడుతున్నాడు. మరో పదినిమిషాల్లో అక్కయ్య కూతురు కార్ మంది. "అమ్మయ్య త్వరగానే పురుడు వచ్చిందని అమ్మ నిట్టూర్చింది. పుట్టుక నుంచి పుడకలతో మండేదాకా అంతా త్వరగా త్వరత్వరగా జరగాలి.